మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# నామినేషన్లు షురూ

**రేపు సాయంత్రం వరకు నామినేషన్ల స్వీకరణ**

**12న నామినేషన్లు పరిశీలన, 15న ఉపసంహరణ**

**జడ్‌పిటిసి., ఎంపిటిసి స్థానిక సంస్థల మొదటి దశ ఎన్నికలు**

**ఎన్నికల నామినేషన్ ప్రక్రియను**

**పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**జడ్చర్ల, అక్టోబరు 9 ప్రభాతవార్త:** జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లాలో మొదటి దశ జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. 8 జెడ్పిటిసి, 89 ఎంపీటీసీ స్థానాలకు నేటి నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం భూత్పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, జరుగుతున్న జడ్పిటిసి ఎన్నిక, అన్న సాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం క్లస్టర్‌లో ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియను,జడ్చర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్‌పిటిసి ఎన్నిక, కొడుగల్ గ్రామ పంచాయతీ క్లస్టర్‌లో ఎంపిటిసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించి రిటర్నింగ్ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లకూ ఆస్కారం లేకుండా నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడత జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు ఈనెల 9 నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 12న నామినేషన్లు పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. మొదటి విడత ఎన్నికలు ఈ నెల 23న పోలింగ్, నవంబర్ 11న కౌంటింగ్ జరగనుంది.

# అక్షయ పాత్ర భోజనంలో తాడి జెర్రీ ?

**జడ్చర్ల, అక్టోబరు 9 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణం సిగ్నల్ గడ్డ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం మధ్యాహ్నం అక్షయ పాత్ర భోజనంలో విద్యార్థులు అన్నం తినేటప్పుడు అన్నంలో తాడిచెర్రి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విద్యార్థులను సమాచారం అడిగి తెలుసుకున్న డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్ అక్షయ పాత్ర భోజనం వస్తున్నప్పటి నుండి విద్యార్థులు చాలామందికి ఆరోగ్యం బాగా లేకుండా పోతుందని విద్యార్థులు చెబుతున్నారు. తాడి జెర్రీ వచ్చినట్టు విద్యార్థులు ఎవరికైనా చెబితే వాళ్లపైన సీరియస్ యాక్షన్ తీసుకుంటామని అక్కడున్న ఉపాధ్యాయులు విద్యార్థులను బెదిరిస్తున్నారని అన్నారు. విద్యార్థులు డివైఎఫ్ఐ సంఘంకి చెప్పడం డివైఎఫ్ఐ కన్వీనర్ ప్రశాంత్, అక్షయ పాత్ర భోజనం బంద్ చేసి స్కూల్లోనే వండించాలని అన్నారు. ప్రభుత్వం స్పందించి అక్షయపాత్ర పై చర్యలు తీసుకోకపోతే విద్యార్థులను రోడ్లపైకి తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రశాంత్ అన్నారు.



భూత్పూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

# ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

**భూత్పూర్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి గురువారం భూత్పూర్ ఎంపీడీఓ కార్యాలయాన్ని, మండలంలోని అన్నాసాగర్ గ్రామాన్ని సందర్శించారు. ఇదేవిధంగా కలెక్టర్ జడ్చర్ల ఎంపిపి కార్యాలయం, కొడంగల్ జీపీ కార్యాలయాలను తనిఖీ చేశారు. స్థానిక సంస్థల తొలి విడత జనిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయా ఎంపిపి కార్యాలయాలు, క్లస్టర్ గ్రామాలను కలెక్టర్ విజయేంద్ర బోయి సందర్శించి తనిఖీ చేశారు. ఆయా -మిగతా4లో..



జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న యునెస్కో సంస్థ సభ్యులు

# పీడీ సుకన్యకు జాతీయ పురస్కారం

**వనపర్తి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్స వం పురస్కరించుకొని ప్రఖ్యాత సంస్థ ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ యునెస్కో సంయుక్తంగా అందించిన ప్రతిష్టాత్మక నేషనల్ బెస్ట్ విబిఎస్ టీచర్ అవార్డు 2024, 2025 ఎంఎంబి ఒలివ చర్చ్ వనపర్తికి చెందిన పిడి సుకన్యకు సమస్త అధినేత గద్దపాటి విజయ రాజు చేతుల మీదుగా అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, వైస్ చైర్మన్ శంకర్ లుక్, తెలంగాణ -మిగతా4లో..

# శ్రీశైలం పాలక మండలి సభ్యుడిగా కట్టా సుధాకర్ రెడ్డి

**సన్మానించిన ఎంపీ డీకే అరుణ**



సుధాకర్ రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** శ్రీశైలం పాలక మండలి సభ్యుడిగా ఎన్నికైన బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకుడు కట్టా సుధాకర్ రెడ్డిని నాయకులు అభినందించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఎంపీ డీకే అరుణమ్మను కట్టా సుదాకర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కట్టా సుదాకర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యులుగా ఎన్నిక కావడం శుభపరిణామం అన్నారు. అరుణమ్మతో పాటు కట్టా సుధకర్ రెడ్డికి బీజేపీ పాలమూరు జిల్లా ముఖ్య నాయకులు పవన్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అభినందనలు తెలిపారు.

# పాలమూరులో భారీ వర్షం



పోతిరెడ్డి చెరువు అలుగు



- నేల కొరిగిన చెట్లు
- అలుగు పారిన చెరువులు కుంటలు
- జడ్చర్ల మండలం కిష్టారం చెరువు అలుగులో గల్లంతైన వృద్ధ దంపతులు
- పేటలో పిడుగుపాటుకు మహిళ మృతి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నారాయణపేట, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం కురవడంతో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెరువులు కుంటలు అలుగులు పారాయి. జడ్చర్ల మండలంలోని కిష్టారం గ్రామంలో చెరువు అలుగు పారడంతో వృద్ధ దంపతులు గల్లంతయ్యారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో పిడుగుపాటుకు మహిళ మృతి చెందింది.

**వర్షపాతం నమోదు ఇలా..**

మహబూబ్‌నగర్ జిల్లాలో సగటున 12.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మహబూబ్‌నగర్ అర్బన్‌లో అత్యధికంగా 40.8 మిల్లీమీటర్ల వర్షపాతం, రెండో స్థానంలో దేవరకద్రలో 37 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అదేవిధంగా నవాబుపేట, మూసాపేట, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాల్లో 20సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయింది.



నీట మునిగిన పంటలు

# నవాబుపేటలో దంచికొట్టిన వాన

- నీట మునిగిన వరి పంటలు
- రోడ్లు జలమయం..ఇబ్బందుల్లో జనం
- మొక్కజొన్న రైతులు విలవిల

దంచికొట్టిన వానల ప్రభావంతో నవాబుపేట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం 3:30 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర వరకు వర్షం దంచికొట్టింది. దీంతో రహదారులు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూచూరు గ్రామ శివారులో వ్యవసాయ పొలం వద్ద పనులు చేస్తున్న రైతులు ఉరుములతో కూడిన పిడుగు పడటంతో జుట్టు చిన్న కృష్ణయ్య, పెద్ద కృష్ణయ్య, భార్య సునీత, ఒకసారిగా పిడుగు శబ్దంతో స్పృహ కోల్పోయి పడ్డారు. అటుగా వెళుతున్న రైతులు చూసి హుటాహుటిన గ్రామస్తులకు తెలియజేయడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రుద్రారం నుండి కూచూరు వెళ్లే మార్గంలో రాజమోని ఒంపు దగ్గర వాగు అధికంగా పారడంతో రెండు ద్విచక్ర వాహనాలు కొట్టుకపోయాయి. ముళ్ళ చెట్లకు తట్టుకొని ఉండటంతో వాహనదారులు అతి కష్టం మీద బైకులను బయటికి తీసుకొచ్చారు. నవాబుపేట దగ్గర గల తెల్లవాగు కూడా ఉధృతంగా -మిగతా4లో..

# వృద్ధ దంపతుల గల్లంతు





జడ్చర్ల మండల పరిధిలో కురిసిన భారీ వర్షం కారణంగా పోతిరెడ్డి చెరువు నీరు రోడ్డుపై పారడంతో రోడ్డు దాటేందుకు ప్రయత్నించిన వృద్ధ దంపతులు గల్లంతయ్యారు. ఈ ఘటన మండల పరిధిలోని కిష్టారంలో చోటు చేసుకుంది. అంబటాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య (70), రాములమ్మ (60) దంపతులు గల్లంతు అయ్యారు. పోతిరెడ్డి చెరువు అలుగు వెళ్లి రోడ్డుపై పారడంతో ఉధృతి ఎక్కువగా రావడం.. అదే సమయంలో రోడ్డు దాటడంతో గల్లంతయ్యారు. మరోవైపు పోలెపల్లి గ్రామానికి చెందిన రాములు గల్లంతవుతుండగా అక్కడే ఉన్న కిష్టారం గ్రామ యువకులు చాకచక్యంగా వ్యవహరించి అతన్ని కాపాడారు. కిష్టారందొడ్డిపల్లి రహదారి వద్ద కూచూరు చిన్న చెరువు అలుగు ప్రమాదకర స్థాయిలో రోడ్డు పై నుంచి పారుతుండటంతో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిన విద్యార్థుల బస్సు కూచూరుకు వెళ్లలేక రోడ్డుపై ఆగిపోవడంతో పిల్లలు అటువైపు తల్లిదండ్రులు ఇటు వైపు ఉండటంతో -మిగతా4లో..

# వైద్యుడు దైవంతో సమానం

**డాక్టర్లపై దాడి చేస్తే సహించం**

**మెడికల్ హబ్‌గా మహబూబ్‌నగర్**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



దవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నగరంలోని రాజేంద్ర నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సాయికిరణ్ ఎండోక్రైయిన్ గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ మెడికల్ హబ్ గా అభివృద్ధి కావడం సంతోషంగా ఉందన్నారు. మహబూబ్ నగర్‌లో అన్ని రకాల అధునాతన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇప్పుడు మహబూబ్ నగర్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని ఆయన చెప్పారు. వైద్యుడు అంటే దేవుడితో సమానమని, ఎలాంటి పరిస్థితుల్లో రోగి ఆసుపత్రికి వచ్చినా నాణ్యమైన వైద్యం అందించి బ్రతికించే ప్రయత్నమే చేస్తారని అన్నారు. డాక్టర్ అంటే ప్రాణాలు నిలబెట్టే వారిగా చూడాలి తప్ప శత్రువుగా చూడరాదని, ఎవరైనా డాక్టర్లపైన దాడి చేసి వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని, అట్టి వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మహబూబ్ నగర్ ను మున్సిపల్ కార్పొరేషన్ గా అభివృద్ధి చేసుకున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి మహబూబ్ నగర్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహబూబ్ నగర్‌లో అటు జడ్చర్లలో మరో బైపాస్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించామని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఐఎంఎ అధ్యక్షులు డా. జె రాంమోహన్, డా. సామ్యేల్ , డా. ప్రవీణ్ కుమార్, డా. చైతన్య రెడ్డి, డా. బి.సాయికిరణ్ , డా.జె.తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించాలి

- కల్వకుర్తి అడ్వాన్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను పరిశీలన
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబరు 9, ప్రభాత వార్త:** సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, విద్యార్థులకు నూతన పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏటీసీ సెంటర్‌లో ఎన్ని మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారో, ఏ ఏ కోర్సులు అందిస్తున్నారో, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా ఉన్నాయా అనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి, ప్రిన్సిపల్‌తో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ జయమ్మ వివరించిన ప్రకారం, ఈ సెంటర్‌లో మోటర్ వెహికల్, డీజిల్ అండ్ పెట్రోల్, సిఎన్జి ఎలక్ట్రానిక్ వంటి వాహనాల రిపేరింగ్ నైపుణ్య శిక్షణ వంటి తరగతులు అందించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆరు రకాల విభాగాల్లో శిక్షణ అందిస్తున్నారు. కలెక్టర్ సెంటర్‌లోని ల్యాబ్‌లు, పరికరాలు, ప్రాజెక్ట్ మోడళ్లు, విద్యార్థుల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే రోజులు పూర్తిగా టెక్నాలజీ ఆధారంగా మారిపోతున్నాయని, ఈ నేపథ్యంలో సాంకేతిక విద్య చాలా కీలకమని చెప్పారు. డిగ్రీ లేదా ఇతర విద్యార్హతలతో పాటు టెక్నికల్ నైపుణ్యాలు నేర్చుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సూచించారు. విద్యార్థులు శ్రద్ధగా, క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలని, నేర్చుకున్న నైపుణ్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక విద్య ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కూడా విస్తరించాయని, విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా కొత్త ఆవిష్కరణలు చేసేందుకు, స్వయం ఉపాధి యజమానులుగా ఎదగాలనే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని ఆయన ప్రోత్సహించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను చేరువ చేస్తున్నాయని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జయమ్మ, కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం, ఏటీసీ కోఆర్డినేటర్, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హత్యా..ఆత్మహత్యా..?

**అనుమానాస్పదంగా..**

**యువ నవదంపతుల ఆత్మహత్య**



రమేష్-శ్రీలక్ష్మి దంపతులు(ఫైల్)

**భూత్పూర్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తూర్ గ్రామంలో బుధవారం రాత్రి నాలుగు నెలల క్రితం పెళ్లి చేసుకున్న పోలెమోని రమేష్(29), నిర్మల అలియాస్ శ్రీలక్ష్మి(21) అనే యువ నవదంపతులు శవాలు మారడం పలువురిని కంటతడి పెట్టించింది. ఈ విషాదకర సంఘటన వివరాల్లోకి వెళితే.. కొత్తూరు గ్రామానికి చెందిన పోలేమోని రమేష్‌కు గోపాల్‌పేట మండలం బీర్కెపల్లి గ్రామానికి చెందిన నిర్మల అలియాస్ శ్రీలక్ష్మికి గత జూన్‌లో వివాహం జరిగింది. నాల్గు నెలల క్రితం జరిగిన ఈ వైవాహిక జీవితంలో వారు అన్యోన్యంగా ఉండేవారని గ్రామస్తులు తెలిపారు. మృతుడు రమేష్ తండ్రి శ్రీశైలం వెళ్లగా, కూలీ పనుల కోసం వెళ్లి తల్లి మణెమ్మ సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు మూసి ఉంచబడి ఉండగా, అనుమానం వేసి మణెమ్మ ఇంటి కిటికీలోంచి చూడగా కోడలు నిర్మల నేలపై పడి ఉండగా, కొడుకు రమేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విఘతజీవులుగా కనిపించారు. వెంటనే మణెమ్మ చుట్టుపక్కల వారిని కేకలు వేస్తూ ఇంటి తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా కొడుకు కోడలిరువురు శవాలుగా కన్పించారు. పరిస్థితిని బట్టి భార్యాభర్తలు ఇరువురు తగవులతో రమేష్ భార్యను కొట్టి చంపాడా..?లేకుంటే భార్య నిర్మల అలియాస్ శ్రీలక్ష్మి ఆత్మహత్య చేసుకుందా.?అన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. భార్య మృతిని చూసి తట్టుకోలేక ఆవేదన, ఆవేశంతో భర్త రమేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడా..?అన్న సందేహాలు గ్రామస్తుల నుంచి వినవస్తున్నాయి. సమాచారం తెల్సుకున్న భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు.

# మద్దూరు ఘటనపై ఫిర్యాదు

**నిజానిజాలు తేల్చాలని బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ వినతి**

**నారాయణపేట టౌన్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** కొడంగల్ అసెంబ్లీ, మద్దూరు మండలం, బోడ మర్రిగడ్డ తండాకు చెందిన గిరిజన బిడ్డ రమేష్ నాయక్ సూసైడ్ నోట్ రాసి మిస్సింగ్ అయిన ఘటనపై గురువారం బిజెపి ఎస్టీ మిర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. రమేష్ నాయక్ కనిపించకుండా పోయి నేటికి 16 రోజుల కావస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మిస్సింగ్ అయిన రమేష్ నాయక్ ఆచూకీ తక్షణమే వెలికితీయాలని, జిహాదీ ఉగ్ర ముఠా సభ్యులు తాజుద్దీన్, యాసిన్ వంటి వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచరులు, జిహాదీల అరాచకాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. గిరిజన సమాజ భద్రత, న్యాయం కోసం బిజెపి ఎస్టీ మోర్చా నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని రవినాయక్ ఆయన స్పష్టం చేశారు.

## విప్లవ వీరుడు చేగువేరా స్ఫూర్తితో యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి

**అమరచింత అక్టోబర్9,ప్రభాతవార్త:** విప్లవ గెరిల్లా పోరాట యోధుడు చేగువేరా స్ఫూర్తితో యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎండి కుతుబ్ పిలుపునిచ్చారు. గెరిల్లా పోరాట యోధుడు చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం అమరచింత మండలంలోని కొంకనివాని పల్లె గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్ల మత్తు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న యువతకు ఉపాధి ఉద్యోగ, అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా సమాజ శ్రేయస్ కోసం పాటుపడాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా చేగువేరా ఆశయ స్ఫూర్తితో యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవ యోధుడు చేగువేరా వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజి, శ్రీను, వెంకటేష్, మైబు, రాజు తదితరులు పాల్గొన్నారు.




కొంకలోని పల్లె గ్రామంలో చేగువేరా వర్ధంతి వేడుకలు

## విజేతలకు బహుమతులు ప్రదానం

**ఉప్పునుంతల, అక్టోబరు 9 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల కేజీబీవీలో గురువారం ఐసిడిఎస్ బలమూరు ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతల మండల సెక్టార్ పరిధిలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బిపాషా ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు, కిశోర బాలికలకు పోషకాహారం ప్రాధాన్యం, శరీరానికి అవసరమైన పోషక విలువలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించి ఉపాధ్యాయులు వివరిస్తూ అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థినిలకు మధ్య పోషకాహార ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేసినట్లు సూపర్‌వైజర్ బిపాషా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ బలమూరు ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతల సూపర్‌వైజర్ బిపాషాతో పాటు ప్రిన్సిపాల్ సైద, అంగన్‌వాడి కార్యకర్తలు, కస్తూరిబా ఉపాధ్యాయులు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బిపాషా

## నిరంతరం ఉపాధ్యాయుల సేవలో తపస్

**ఊట్కూర్,అక్టోబరు9 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులకు వృత్తి పరమైన అంశాలలో సహకారం అందించడంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఎల్లప్పుడూ ముందుంటుందని మండల అధ్యక్షులు కృష్ణ, జిల్లా సమన్వయకర్త నర్సింగప్ప తెలిపారు. వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిలో చేరిన దగ్గరినుంచి విధి నిర్వహణ వరకు అవసరమైన సేవలను తపస్ నిరంతరం అందిస్తోంది. గత సంవత్సరం విధుల్లో చేరిన ఉపాధ్యాయుల సర్వీస్ బుక్స్ ముద్రించి, వాటిని రాయించి అందించడం ద్వారా తపస్ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది," అని అన్నారు. వారు ఇంకా పేర్కొంటూ, ఉపాధ్యాయుల వృత్తి పరమైన సమస్యల పరిష్కారంతో పాటు, వారికి బోధనలో స్వేచ్ఛ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో తపస్ నిరంతరం కృషి చేస్తోంది" అన్నారు. ఈకార్యక్రమంలో తపస్ జిల్లామీడియా ఇన్‌చార్జ్ కిరణ్,మండల కార్యదర్శి గోపాల్,కోశాధికారి బన్నేష్,నాయకులు నర్సిములు,ఉపాధ్యాయులు శ్రీధర్, హాజిబాబా, అశోక్, సోహైల్, మహేష్, మంజుల, రవళిక, శివాని, గోదావరి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సర్వీసు బుక్స్ అందజేస్తున్న దృశ్యం

## బ్యాంకు లావాదేవీలకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ శివశంకర్

**నారాయణ పేట, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోని వివిధ బ్యాంకుల వద్ద సీఐ శివశంకర్ ఎస్ఐ వెంకటేశ్వర్లులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ఈసందర్భంగా బ్యాంకు పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. సీఐ బ్యాంకు కస్టమర్లకు భద్రతాపరమైన సూచనలు అందజేశారుడబ్బు జమ లేదా డ్రా చేసుకునే సమయంలో అపరిచితుల సహాయం తీసుకోవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు ఓటిపి, ఏటీఎం పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు బ్యాంకు సిబ్బంది సీసీ కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయా లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. భద్రతా గార్డులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు బ్యాంకు మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే డైల్ 100కు సమాచారం ఇవ్వాలని సీఐ శివశంకర్ కోరారు.



బ్యాంకుల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ శివశంకర్

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలి

**అమరచింత అక్టోబర్ 9, ప్రభాతవార్త:** రైతులు తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభాలు పొందాలని హైదరాబాద్ రాజేంద్రనగర్ అగ్రికల్చర్ పరిశోధన శాస్త్రవేత్త ఆది ప్రసాద్ అన్నారు. గురువారం అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామంలో రైతులకు పంపిణీ చేసిన ఐసిహెచ్ 5 హైబ్రిడ్ విత్తనం వేసుకున్న ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐ సి హెచ్ 5 విత్తనాల వల్ల ఎకరాకు 10 నుండి 12 కింటాలు దిగుబడి వస్తుందని ప్రతి రైతు ఆముద పంటలను వేసుకోవాలని ఆయన రైతులను కోరారు. అలాగే యాసంగిలో మళ్లీ ఆముదం పంటలు సాగు చేసుకునేందుకు మినీ కిడ్స్ విత్తనాన్ని రైతులకు అందజేశారు. రైతులు ఆముదం రకం వాడడం వల్ల పంటలకు తెగుళ్లు రాకుండా ఆముదం విత్తనాలు తట్టుకుంటున్నాయని ఆముదం పండించే ప్రతి రైతు నాణ్యమైన విత్తనాలు వాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అమరచింత మండల వ్యవసాయ అధికారి, అరవిందు, రైతులు పాల్గొన్నారు.



నందిమల్ల గ్రామంలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

## చేగువేరా స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

**వనపర్తి, అక్టోబరు 9 ప్రభాతవార్త :** ప్రపంచ విప్లవ యోధుడు సోషలిస్టు సమాజం కోసం పోరాడి ప్రాణాలర్పించిన చేగువేరా స్ఫూర్తితో సిపిఐ నేతలు కార్యకర్తలు ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. వనపర్తి సిపిఐ ఆఫీస్‌లో చేగువేరా 58వ వర్ధంతి సిపిఐ పట్టణ కమిటీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లాడుతూ.. డాక్టర్‌గా మంత్రిగా విప్లవకారుడిగా ఆయన పోరాటం చిరస్మరణీయమన్నారు. ప్రజా పోరాటంలో ఆయన ప్రాణాలు కోల్పోయిన ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానం సాధించారని, ఆయన సోషలిస్టు సమాజ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. చేగువేరాకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఇప్పటికీ ఉన్నారంటే ప్రజల కోసం ఆయన సాగించిన పోరాటం చేసిన త్యాగాలే కారణమన్నారు. ఆస్ఫూర్తితో అందరం పని చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాథం, జిల్లా నేతలు జ్యోతి, రూప, సుప్రియ, సిపిఐ నేతలు అంజి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.




చేగువేరా 58వ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

# బాకీ కార్డుతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పండి

### మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**ఆత్మకూర్ అక్టోబర్ 9, ప్రభాతవార్త:** గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా రాష్ట్రవ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాకీ కార్డు ద్వారా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను వివరించడం జరుగుతుందని తద్వారా బాకీ కార్డుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు రామ్మోహన్ రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ప్రజలకు ఇచ్చిందని గత రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరలచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేత విధాల ప్రయత్నిస్తుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామంటూ కాంగ్రెస్ పార్టీ మరోసారి బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీలకు 42 రిజర్వేషన్ సాధించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆయన అన్నారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటడిగేందుకు వచ్చిన తరుణంలో బాకీ పడ్డ మొత్తాన్ని చెల్లించాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రానివ్వమని ప్రజా ప్రతినిధులకు నిరసనల ద్వారా తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు., మక్తల్ నియోజకవర్గం టిఆర్ఎస్వి నాయకులు రియాజ్ అలీ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బాకీ కార్డు ద్వారా ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

# చెరుకు ధర టన్నుకు రూ.6వేలు ఇవ్వాలి

### కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె. రాజన్న డిమాండ్

**అమరచింత అక్టోబర్ 9, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చెరుకు రైతులకు మద్దతు ధర టన్నుకు 6000 ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అమరచింత మండల కేంద్రంలోని చెరుకు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికే అన్నదాతగా ప్రభుత్వాలు ప్రచారం చేసుకుంటున్నా పంటలు పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చెరుకు రైతులకు మద్దతు ధర 6000 ఇవ్వాలని అలాగే కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యజమాన్యం రైతుల దగ్గర కొనుగోలు చేసిన 14 రోజులలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే చెరుకు పంట గ్రామాలలో రోడ్లు లేక చెరుకు రవణకు ఇబ్బందులు వస్తున్నాయని వెంటనే సి డి సి నిధుల నుండి రోడ్లు బాగు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యజమాన్యం చెరుకు పంటల కోతల సమయంలో లేబరు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కోతలకు సరిపడే లేబర్ ను రప్పించాలని ఆయన కోరారు. చెరుకు రైతుల ఐక్య పోరాటాలతో కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యజమాన్యం సమస్యలు పరిష్కరించినందుకు యజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 11న ఆత్మకూర్ మార్కెట్ ఆవరణలో చెరుకు రైతుల సమావేశం నిర్వహిస్తున్నామని ఈ సమావేశానికి చెరుకు రైతులు భారీగా హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి బాబు, రవి, చంద్రసేన రెడ్డి, రంగారెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాసులు, యువరాజ్, డేవిడ్, విజయ్, శేఖర్, శ్రీకాంత్, వెంకటయ్య ఎర్ర కూర్మన్న, చిన్న కురుమన్న రైతులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న చెరుకు రైతులు

## ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి: మాజీ ఎమ్మెల్యే చిట్టెం

**ఆత్మకూర్ అక్టోబర్ 9, ప్రభాతవార్త :** ప్రస్తుత సమాజంలో ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో జరుగుతున్న పాండురంగ స్వామి ఉత్సవాలకు ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిన్న పెద్ద తారతమే భేదం లేకుండా వివరిస్తున్న తరుణంలో ప్రజలు జీవన విధానంలో భక్తి భావాన్ని అలవాటుగా చేసుకోవాలని తద్వారా ధర్మం వైపు నిలబడ్డ వారు అవుతామని ఆయన సూచించారు. ప్రతి సంవత్సరం మూలమల్ల గ్రామంలో జరుగుతున్న పాండురంగ స్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు మరియు యువకులు చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అంతకు ముందుకు ఆయన గ్రామంలోని పాండురంగ స్వామి దేవాలయాన్ని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కోటేశ్వర్ టిఆర్ఎస్ నాయకులు భీమన్న రియాజ్ అలీ వెంకటేష్,షరీఫ్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## టిఎస్‌పిఎస్‌సి నూతన సభ్యుడు లక్ష్మీకాంత్ రాథోడ్‌కు సన్మానం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నూతన సభ్యుడుగా ఎంపికైన ప్రొఫెసర్ ఎల్‌బి లక్ష్మీకాంత్ రాథోడ్‌ను బుధవారం నారాయణపేట జిల్లా వాసులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అప్పక్ పల్లికి చెందిన తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బంగాలి వెంకటయ్య నేతృత్వంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం (పేట టీఎస్) మాజీ జిల్లా అధ్యక్షుడు కథలప్ప, టియుడబ్ల్యూ జె ఐజెయు జిల్లా అధ్యక్షులు కే.నారాయణరెడ్డి, జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ రాజేష్ కుమార్, పిఈటి పారిజాతలు హైదరాబాద్ నగరంలోని డా. అంబేద్కర్ సచివాలయ ప్రాంగణంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించి, బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ బంగాలి వెంకటయ్య మాట్లాడుతూ పరిశోధన, అకాడమిక రంగంలో విశేష ప్రతిభ కనబరచి 21 పీహెచ్‌డీలు, 8 ఎంఫిల్‌లు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో వందకు పైగా పరిశోధన వ్యాసాలు, 9 పుస్తకాలు ప్రచురించడమే కాకుండా, అకాడమిక్, పరిశోధనా రంగాలలో 24 దేశాలను సందర్శించి, హాకీ లెజెండరీ మేజర్ ధ్యాన్ చంద్ మెమోరియల్ అవార్డును అందుకోవడం దేశానికి గర్వకారణమన్నారు. నారాయణపేట జిల్లా వాసిగా పుట్టి పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతిగా, ఉస్మానియా, శాతవాహన విశ్వవిద్యాలయాలలో విద్యా ఫ్యాకల్టీ డీన్, నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతిగా, విశ్వవిద్యాలయాల క్రీడల కార్యదర్శిగా ఎన్నో విశిష్టమైన సేవలందించారాని ఆయన సేవలను కొనియాడారు. తాజాగా ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా నియమితులు కావడం జిల్లా వాసులుగా ఎంతో గర్వపడుతున్నామని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొంది రాష్ట్రానికి ఎంతో సేవ చేయాలని ఆకాంక్షించారు.



లక్ష్మీకాంత్ రాథోడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కేంద్రాల వివరాలు

**ఉప్పునుంతల, అక్టోబరు 9 ప్రభాతవార్త :** 2025, 26 సంవత్సరా నికి గాను మండలంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగే అభ్యర్థుల నామినేషన్ల కేంద్రాల వివరాలు అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపిడిఓ మోహన్ లాల్ వివరించారు. మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలకు గాను 4 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపిడిఓ మోహన్ లాల్ వివరించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల మండల ప్రాథమిక పాఠశాలలో (ఉప్పునుంతల ఎంపీటీసీ 1,ఉప్పునుంతల ఎంపీటీసీ 2, కంసానిపల్లి) ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయడానికి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అదేవిధంగా స్థానిక పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతల హాల్ నెంబర్ 1లో (సదగోడు, మర్రిపల్లి, మామిళ్ళపల్లి), పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతల హాల్ నెంబర్ 2 లో (వెల్టూరు, తాడూరు )ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయడానికి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ లో (పిరట్వాన్ పల్లి, పెనిమి ళ్ళ) ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయడానికి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

**సర్పంచుల నామినేషన్ల కేంద్రాలు...** మండలంలో 27 గ్రామ పంచాయతీల గాను 7 కేంద్రాలలో సర్పంచుల నామినేషన్ల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపిడిఓ మోహన్ లాల్ వివరించారు. ఉప్పునుంతల సెక్టార్ పరిధిలో (ఉప్పునుంతల, దేవదారి కుంట తండా, కంసానిపల్లి, కంసాని పల్లి తండా) లకు గ్రామ సర్పంచుల అభ్యర్థులతో పాటు 36వార్డులకు నామినేషన్లు దాఖలు చేయడానికి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అదేవిధంగా పిరట్వాన్ పల్లి సెక్టార్ పరిధిలో (పిరట్వాన్ పల్లి,అయ్యవారిపల్లి, రాయిచేడు) 24 వార్డులకు,సదగోడు సెక్టార్ పరిధిలో ( సదగోడు, తిరుమ లపూర్ మొల్గర, పెద్దాపూర్) గ్రామాలలో 32 వార్డులకు, వెల్టూరు సెక్టార్ పరిధిలో (వెల్టూరు, సూర్య తండా, తాడూరు, తిప్పాపూర్, కొరటికల్) 40 వార్డులకు, గువ్వలోని పల్లి సెక్టార్ పరిధిలో (గువ్వలోని పల్లి, ఈరట్వాన్ పల్లి, లతీపూర్) 24 వార్డులకు, పెనిమెళ్ళ సెక్టార్ పరిధిలో (పెనిమిళ్ళ, సిబి తండా, సూర్య తాండ) 22 వార్డులకు, లక్ష్మాపూర్ సెక్టార్ పరిధిలో నాలుగు గ్రామపంచాయతీలు (లక్ష్మాపూర్, దాసర్లపల్లి, మామిళ్ళపల్లి, ఉప్పరిపల్లి, మర్రిపల్లి) 42 వార్డులకు నామినేషన్లు దాఖలు చేయడానికి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపిడిఓ మోహన్ లాల్ వివరించారు. ఈనెల 13 నుంచి ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయడానికి సన్నాహాలు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఎన్నికలకు మూడో విడత లో మండలంలో ఎన్నికలు జరగనట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.



ఎన్నికల అధికారి మోహన్ లాల్

## బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరం

**మూసాపేట్,అక్టోబరు 9 ప్రభాతవార్త :** బీసీలకు న్యాయాబద్ధ పరంగా 42 శాతం రావలసిన రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని బిసి పొలిటికల్ జేఏసీ మూసాపేట మండల అధ్యక్షుడు నల్ల తిరుపతయ్య గౌడ్ ఓ ప్రకటనలో ఆవేదన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రతిపక్షాలు సహ కరించకపోవడంతో హైకోర్టు స్టే ఇచ్చిందని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కల్పించడం కోసం కుల గణన చేయడంతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల లెక్క తేల్చిందని ఆయన తెలిపారు. బీసీ నోటి కాడి బువ్వ అందకుండా పోయిందని అయిన ఎలాంటి నిరాశ నిస్పృహలకు పోకుండా 42% రిజర్వేషన్లు అమలయ్యేవరకు బీసీల ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.



## డీజీపీని కలిసిన ఎస్పీ డా.వినీత్



**నారాయణ పేట, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా. వినీత్ గురువారం హైదరాబాద్‌లోని డీజీపీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ని పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీ నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డా. వినీత్‌కి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ఎస్పీ నారాయణపేట ప్రజల భద్రత మహిళా రక్షణ సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. సాంకేతికత ఆధారిత ఆధునిక పోలీసింగ్ ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

## విగ్రహ పునః ప్రతిష్ఠాపనకు విరాళం



విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం అందజేస్తున్న దృశ్యం

**ఊట్కూర్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో గల శ్రీ వ్యాసరాయుల మహర్షిచే ప్రతిష్ఠించబడిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమానికి గడ్డం ఆశమ్మ భక్తితో రూ.10,000 విరాళం అందించారు. గురువారం ఆమె ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మహేష్ గౌడ్, సి. అశోక్, జి. శేఖర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు గడ్డం ఆశమ్మను అభినందించి శాలువాతో సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యుడు మహేష్ గౌడ్ మాట్లాడుతూ "శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపనలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించి కార్యక్రమం విజయవంతం చేయాలి" అని కోరారు.

## బిజెపి నాయకులపై కేసు కొట్టివేత




కేసు కొట్టివేసిన తర్వాత కోర్టు వద్ద బిజెపి నాయకులు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ ఇతర 13 మంది బిజెపి నాయకులపై 2019లో నమోదు చేసిన కేసును మంగళవారం కొడంగల్ జడ్జి కొట్టివేశారు. అప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా కొడంగల్ నుంచి పోటీ చేసిన నాగు రావు నామాజీ ఇతర నాయకులు ఎన్నికల నిబంధనలు అతిక్రమించారని అధికారులు కేసులు నమోదు చేశారు. వాదోపవాదాలు విన్న జడ్జి కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు.

## ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ముదిరాజులమంతా పాల్గొందాం

### పేట ముదిరాజ్ సంఘం తీర్మానం



సమావేశమైన ముదిరాజ్ నాయకులు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 11న శనివారం జరిగే ఆర్ఎస్ఎస్ పద సంచలన కార్యక్రమంలో పట్టణంలోని ముదిరాజు లంత పాల్గొనాలని పట్టణ ముదిరాజ్ సంఘం నిర్ణయించింది. ఆ కార్యక్రమంలో ప్రతి ముదిరాజు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజు, పట్టణ అధ్యక్షులు మిర్చి వెంకటయ్య, పట్టణ ఉపాధ్యక్షులు పల్లా వెంకట రాములు, ప్రధాన కార్యదర్శి మల్లేష, మాజీ ముదిరాజ్ సంఘ అధ్యక్షులు గురు మేస్త్రి, కాకర్ల భీమయ్య, వార్డు అధ్యక్షులు రాజు, బోకుల రాజు, జనార్ధన్, లక్ష్మణ్, గోవింద్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణ అభివృద్ధి కుంటుపడింది : మాజీ ఎమ్మెల్యే

**వెల్దండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా గ్రామీణ ప్రాంత అభివృద్ధి కుంటు పడిందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో అజిలాపూర్ బిఆర్ఎస్ పార్టీ ఎంపిటీసీ అభ్యర్థిగా పోడుగు నాగశ్రీని ఎంపిక చేసి ప్రకటించి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి తో కలిసి జైపాల్ యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ఒకటిన్నర సంవత్సరం కాలయాపన చేస్తూ గ్రామీణ అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సి న నిధులు రాక గ్రామాల అభివృద్ధికి నోచుకోలేదని, గతంలో సర్పంచులు చేసిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదని, గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ పాలన పై విసుకు చెందారు, ఏ ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని ప్రజలకు ఇచ్చిన బాకీ కార్డును ప్రజలందరికీ అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఐజాక్, నాయకులు కర్ణాకర్ రెడ్డి, వెంకటయ్య, రమేష్‌గౌడ్, రవిగౌడ్, నిరంజన్, సోమయ్యతో పాటు తదితరులు ఉన్నారు.


నామినేషన్ పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## నేటి బంద్‌ను విజయవంతం చేయండి

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్**

**మహబూబ్‌నగర్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ముందుకు వెళ్లకుండా వివిధ రకాలుగా అడ్డంకులు సృష్టించి రిజర్వేషన్ అమలు కాకుండా రెడ్డి జాగృతి వాళ్ల చే పిటిషన్లు వేయించి స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా కోర్టులో పిటిషన్లు వేసి 42 శాతం రిజర్వేషన్ అమలు కాకుండా హైకోర్టు నుండి స్టే రావడానికి కారకులైన కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ నేడు బంద్ కు పిలుపునిస్తున్నట్లు బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వ్యాపార సముదాయాలు, సినిమా హాలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి బీసీల బందుకు సహకరించాలని అలాగే అన్నిపార్టీలలో ఉన్న బీసీ నాయకులు, కుల సంఘ నాయకులు, ప్రతినిధులు, విద్యార్థి సంఘ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బీసీల 42% బిల్లుకు మద్దతు తెలపాలని ఆయన కోరారు.

## వేతనాల కోసం అవస్థలు పడుతున్న 1962 మొబైల్ అంబులెన్స్ సిబ్బంది

**నారాయణ పేట, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా సంచార పశువైద్య సేవలు అందిస్తున్న 1962 మొబైల్ అంబులెన్స్ సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14 మొబైల్ అంబులెన్స్ వాహనాలు సేవలు అందిస్తున్నాయి. ఈ వాహనాలు మూగజీవులకు ఎటువంటి ప్రమాదం సంభవించినా వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్సతో పాటు అవసరమైన మందులను అందిస్తున్నాయి. డా. పారావెట్ కెప్టెన్ హెల్పర్ నలుగురు సిబ్బంది ప్రతి వాహనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే గత మూడు నెలలుగా వేతనాలు రాక సిబ్బంది ఆర్థికంగా కష్టాలు పడుతున్నారు. కుటుంబ పోషణ పిల్లల చదువులు అప్పులు వంటి భారాలు మోయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. తమకు వచ్చే జీతాలు ఆలస్యం కాకుండా క్రమం తప్పకుండా ఇవ్వాలని ప్రభుత్వాన్ని సిబ్బంది కోరుతున్నారు. సమయానికి వేతనాలు అందితే మరింత నిబద్ధతతో పనిచేయగలమని పేర్కొన్నారు. జీతాల సమస్య పరిష్కరించకపోతే ఆందోళనకు దిగేందుకు సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకొని తక్షణమే మూడు నెలల బకాయి వేతనాలను విడుదల చేయాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.


1962 మొబైల్ అంబులెన్స్ సిబ్బంది

## ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

**వెల్దండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఎస్‌టియు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఉపాధ్యాయ సంఘాలు సమైక్య పోరాటానికి సిద్ధం కావాలని, పెండింగ్ బిల్లులు, ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించబడతాయని ఎస్‌టియు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎస్ మురళి, ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావులు అన్నారు. గురువారం వెల్దండ మండల కేంద్రంతో పాటు కొట్ర, గుండాల, చెదురుపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సాధించబడితే ఎంఈఓ, జేఎల్, డిప్యూటీ డిఈఓల పదోన్నతులకు మార్గం ఏర్పడుతుందని, ఇంకా ఐదు పెండింగ్ డీలు చెల్లించి పిఆర్‌సిని ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపయోగపడని శిక్షణలతో ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలిగించవద్దని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు చెన్నకేశవులు, మల్లేష్, నాయకులు అమరేందర్‌రావు, పత్యానాయక్, అశోక్, మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎస్ మురళి, ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావులు

## ఎర్రవల్లి మండల వ్యవసాయ అధికారిగా సురేష్

**ఇటిక్యాల అక్టోబర్ 9, ప్రభాతవార్త:** ఉమ్మడి మండలంలోని కొత్తగా ఏర్పాటు అయిన ఎర్రవల్లి మండల వ్యవసాయ అధికారిగా సురేష్ గురువారం మండల పరిధిలోని పుటాన్ దొడ్డి గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో ఏఈఓ గా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్ పై ఎర్రవల్లి మండల వ్యవసాయ అధికారిగా వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.ఇ టిక్యాల. ఎర్రవల్లి ఉమ్మడి మండలాలకు వ్యవసాయ అధికారిగా రవికుమార్ విధులు నిర్వహిస్తుండగా కొత్త ఎర్రవల్లి మండలానికి వ్యవసాయ అధికారిగా సురేష్ రావడంతో ఆయనకు ఎర్రవల్లి మండల బాధ్యతలు రవికుమార్ అప్పజెప్పారు.. ఈ సందర్భంగా నూతన మండల వ్యవసాయ అధికారి సురేష్ మాట్లాడుతూ... మండల పరిధిలోని గ్రామాలలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనులు. రైతులకు పంటల సాగుపై అలాగే సబ్సిడీపై వచ్చే యంత్రాల వివరాలు అన్ని అంశాలపై ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎర్రవల్లి నూతన మండల వ్యవసాయ అధికారి సురేష్ తెలిపారు..


బాధ్యతలు చేపట్టిన సురేష్

## బాధిత కుటుంబానికి భరోసా

**అండగా నిలిచిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**రూ.4.50 లక్షల చెక్కు అందజేత**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నగరంలోని హబీబ్ నగర్ కు చెందిన జహంగీర్ 10 నెలల క్రితం స్థానిక అలీస్ మార్ట్ వద్ద విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. విద్యుత్తు శాఖ అధికారులతో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. విద్యుత్తు శాఖ అధికారులు మృతుని కుటుంబానికి రూ.4 లక్షల 50 వేలు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. అందుకు సంబంధించిన చెక్కును గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు గౌరవ ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్ సాదతుల్లా, మైబు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

## పెండింగ్ వేతనం తక్షణమే విడుదల చేయాలి

**తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్**

**వనపర్తి జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డా. రంగారావుకి కార్మికుల వినతి**

**వనపర్తి, అక్టోబరు 9 ప్రభాతవార్త :** వేతనాలు తక్షణమే అందించాలని అంబియన్స్ ఏజెన్సీకి సూపరిండెంట్ రంగారావు ఆదేశం వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు పెండింగ్ జీతం వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికుల దీర్ఘకాలిక తక్షణ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగారావుకి ఆయన ఛాంబర్‌లో వినతి పత్రాన్ని అందజేసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ అధికారుల విచారణ జరుగుతున్న నేపథ్యంలో కార్మికులకు వేతనాలు అందలేదని దీనితో కార్మికుల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 500లకు పైగా పడకల సామర్థ్యం అనుగుణంగా ఆసుపత్రి నడుస్తున్నదని కానీ ప్రభుత్వం నుండి కేవలం 330 పడకల సామర్థ్యానికి మాత్రమే కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. 143 మంది కార్మికులపై అదనపు పనిభారం పడడంతో కార్మికులు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతూ ఆరోగ్యపరంగా ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. కనుక ప్రభుత్వం పడకల సామర్థ్యానికి అనుగుణంగా కార్మికులను సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీల మూడు సంవత్సరాల కాల పరిమితి ముగిసిందని కనుక ప్రభుత్వం వెంటనే కనీస వేతన జీవోలు విడుదల చేసి 26,000 కార్మికులకు అందే విధంగా నూతన టెండర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పిఎఫ్, ఈఎస్ఐ తప్పులను సవరించి కార్మికులకు ఈఎస్ఐ కార్డులు అందజేయాలని కోరారు. పెండింగ్ వేతనం చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి ఏవో శ్రీనివాస్, అంబియన్స్ ఏజెన్సీ నిర్వాహకులు రాంచంద్రారెడ్డి, వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు గంధం శీను, నరసింహ, దర్గా స్వామి, నరేందర్, మోహన్ బాబు, జలాల్, ప్రవీణ్, నాగరాజ్, భరత్, శివ, కళావతి, ఇందిరా,లక్ష్మమ్మ బాలమణి, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఇంచార్జ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

## పేదల వైద్య విద్య కలను సాకారం చేసిన ఘనత కేసీఆర్‌దే

**నా హయంలో జిల్లా మెడికల్ కాలేజ్ మంజూరు చేయడం గర్వంగా ఉంది**

**ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థినికి మాజీ మంత్రి డా. సీ. లక్ష్మారెడ్డి అభినందన**

**జడ్చర్ల, అక్టోబరు 9 ప్రభాతవార్త:** పేద, సామాన్య కుటుంబాల విద్యార్థులు వైద్య విద్య చదవాలన్న కలను సాకారం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని మాజీ ఆరోగ్యశాఖ మంత్రి డా. సీ. లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా వారీగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్థాపించాలన్న కేసీఆర్ దూరదృష్టితోనే, నేడు తెలంగాణలో వైద్య విద్య సామాన్యులకు చేరువైనదని ఆయన గర్వంగా పేర్కొన్నారు. తాను ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ఆమోదం పొందించడం నా జీవితంలో గర్వకారణం అని తెలిపారు. మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన ప్రియా ఏంజెల్ ను డా. లక్ష్మారెడ్డి స్వయంగా అభినందించారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజాభిప్రాయం, ప్రజల ఆశీస్సులు మించినవి లేవన్నారు. జహీరాబాద్ కాలెజ్ అఫ్ ఎక్సలెన్స్‌లో మెడికల్ సీట్లు సాధించిన 15 మందిలో ప్రియా ఏంజెల్ కూడా ఒకరు. కాగా 6వ తరగతి నుంచి కెసిఆర్ స్థాపించిన మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ కాలేజ్‌లోనే చదివిన ప్రియా మెడికల్ సీటు సాధించడం మన అందరికీ గర్వకారణం అని అన్నారు. వనపర్తి వంటి వెనుకబడిన జిల్లాలో మెడికల్ కాలేజ్ రావడం, స్థానిక విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు కలగడం కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమైంది. ఆ దూరదృష్టి తెలంగాణ ఆరోగ్య రంగానికి పునాది వేసింది అని పేర్కొన్నారు. పేదలు, గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన కేసీఆర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలని ఇది తెలంగాణ యువత సాధికారతకు నిదర్శనం అని అన్నారు.


విద్యార్థినికి స్వీటు తినిపిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

## ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతి వేడుకలు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా 58 వర్ధంతి వేడుకలను గురువారం నారాయణపేట్ జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేటమండల్ గ్రౌండ్‌స్కూల్లో ముందు చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శులు నరహరిమాట్లాడుతూ అక్టోబర్9 ప్రపంచ విప్లవకారుడు,సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఎర్నెస్టో చేగువేరా యొక్క వర్ధంతి. 1967లో ఈరోజున బొలీవియాలో ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కానీ ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, సామాజిక న్యాయం కోసం పోరాటం ఈరోజు ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి యువతకు స్ఫూర్తిని స్తూనే చేగువేరా అన్నారు.ఒక వైద్యుడిగా తన జీవితాన్ని ప్రారంభించినప్పటికీ,లాటిన్ అమెరికా ప్రపంచవ్యాప్తంగా అణగారిన వర్గాల స్వాతంత్రం కోసం పోరాటం చేశారు. క్యూబా విప్లవంలో కీలక పాత్ర పోషించిన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేశారు.ఆయన జీవితం యువతకు,సమాజంలో మార్పుకోసం పనిచేయాల నుకునే వారికి ఒక స్ఫూర్తిదాయక విప్లవకారుడు త్యాగాన్ని, ఆదర్శాలను స్మరించుకుంటూ, సమాజంలో అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని అదేవిధంగా ఆయన స్ఫూర్తితో, సమానత్వం, న్యాయం, మానవ హక్కుల యువత సమాజ మార్పు కోసం ఈ ప్రభుత్వాలపై పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, విద్యార్థులు ఉన్నారు.


చేగువేరా వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## బహుజన నాయకుడు కాన్షీరామ్‌కు ఘన నివాళి

**నారాయణపేట టౌన్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, దేశంలో బహుజనులకు రాజ్యాధికార స్ఫూర్తి నింపిన మాన్యవర్ కాన్షీరామ్ 19వ వర్ధంతి సందర్భంగా బీఎస్పీ నాయకులు ఘననివాళి అర్పించారు. బుధవారం నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అభినందన గార్డెన్‌లో జరిగిన వర్ధంతి సభ బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జుట్ల నరేందర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు న్యాయం రాజ్యాధికారంతోనే సాధ్యమని, దేశంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలను ఆధిపత్య కుల పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటూ రాజ్యాధికారం చెలాయిస్తున్నాయని తెలిపారు. కాన్షీరామ్ స్థాపించిన బీఎస్పీ తోనే బహుజనుల రాజ్యాధికారం సాధ్యమని పేర్కొన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశ సంపదలో అందరికీ సమాన వాటాలు పంచడమే బీఎస్పీ లక్ష్యమని, కాన్షీరామ్ పని విధానంతో తెలంగాణలో బహుజన రాజ్యం సాధించి తీరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి బండారి చంద్ర శేఖర్, జిల్లా ఇంచార్జ్ గువ్వల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం రాజు, జిల్లా ఈసీ మెంబర్ దాసరి అశోక్, మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కెవి నరసింహ, ఇంచార్జ్ పాలెం వెంకటయ్య, కోశాధికారి మల్లికార్జున్, పేట అసెంబ్లీ అధ్యకులు హన్మంతు, ధన్వాడ మండల అధ్యక్షులు రవి యాదవ్, కోయిలకొండ మండల అధ్యక్షులు హన్మంతు, బీఎస్పీ నాయకులు, వీరన్న, హరీష్, అజయ్ కుమార్, మోహన్, వివేక్, రామాంజనే యులు, చెన్నయ్య, వెంకటయ్య, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


కాన్షీరామ్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

## పిడుగు పడి మృతి చెందిన మహిళ కుటుంబాన్ని పరామర్శించిన నామాజీ

**నారాయణపేటటౌన్, అక్టోబరు9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని పళ్ల బురుజు ప్రాంతానికి చెందిన కందుకూ రి పద్మ పట్టణ పరిధిలో గురువారం సాయంత్రం పిడుగు పాడి మహిళ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర సీనియర్‌నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగు రావునామాజీ మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి కుటుం బానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


పరామర్శిస్తున్న నామాజీ

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే యెన్నం పరామర్శ

**మహబూబ్‌నగర్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి భర్త ఎస్ వెంకటయ్య అనారోగ్యంతో బుధవారం మరణించారు. స్థానిక నాయకుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గురువారం వెంకటలక్ష్మిని వారి ఇంటికి వెళ్ళి పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఆమెకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు చర్ల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## పేటకు ఎన్నికల పరిశీలకులు


కలెక్టర్‌తో సమావేశమైన ఎన్నికల పరిశీలకులు కాత్యాయనిదేవి

**నారాయణపేట,అక్టోబరు9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై జెడ్పిటిసి ఎంపిటిసి, సాధారణ ఎన్నికల పరిశీలకులు పీ.కాత్యాయని దేవితో చర్చిం చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల సవ్య నిర్వహణ భద్రతా ఏ ర్పాట్లు ప్రజా భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పరిశీ లకులు సూచించారు. జిల్లా అధికారులు ఏర్పాట్లు ప్రణాళికలు వివరించారు. పరిశీలకుల సూచనలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## బీసీల నోటికాడి ముద్ద లాక్కుంటున్న అగ్రకుల నాయకులు

**బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్**



మాట్లాడుతున్న బూర్గుపల్లి కృష్ణ యాదవ్

**నారాయణ పేట, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో బీసీ జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు ఎడ్ల కుర్మయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు గత 75 ఏళ్లుగా రిజర్వేషన్లు అమలు కాకుండా అగ్రకుల నాయకులు అడ్డుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నామినేటెడ్ స్థానిక సంస్థల పదవుల్లో కూడా బీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగిస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలయితే బీసీలకు కనీస న్యాయం జరిగేదని పేర్కొన్నారు. అయితే కొందరు రెడ్డి జాగృతి నాయకులు కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లను అడ్డుకోవడం బీసీలకు వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధతతో రిజర్వేషన్లు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బీసీలకు రాజకీయంగా తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ వర్గానికి చెందిన అధికార పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు పార్టీకి రాజీనామా చేసి ఉద్యమానికి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య, రాజు, సతీష్, గోవింద్, జనార్దన్, రాములు, ఎల్లప్ప, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నదిలో ఎన్ డి ఆర్ ఎఫ్ మాక్ డ్రిల్

**అలంపూర్ అక్టోబర్ 10, ప్రభాతవార్త :** ప్రకృతి వైపరీత్యాల నిమిత్తం ఎమర్జెన్సీలో తమ యొక్క ప్రాణాలను మరియు ఇతర యొక్క ప్రాణాలను ఎలా కాపాడుకోవాలని ఎన్‌డిఆర్‌ఎఫ్, డిడిఆర్‌ఎఫ్ బృందాలచే గురువారం రోజు ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి అమ్మవారి పుష్కర ఘాటు నందు ఉన్న తుంగభద్ర నదిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్‌ఎఫ్ చీఫ్ దేవేందర్ సింగ్ మాట్లాడుతూ, ప్రకృతి వైపల్యాల సమయంలో తమ యొక్క ప్రాణాలను, మరియు ఇతర ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వరదలు వచ్చిన సమయంలో ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు ఎవరు ఆ ధైర్య పడకుండగా ఈ మాక్ డ్రిల్ ద్వారా ఎవరి మీద ఆధారపడకుండా ప్రజలు తమ ప్రాణాలను తాము కాపాడుకోవచ్చని సూచించారు. స్పెషల్ బోర్డుల సహాయంతో కళ్ళకు కట్టినట్లు వరదల సమయంలో ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో ప్రత్యక్షంగా ఎన్డీఆర్‌ఎఫ్ బృందం ప్రజలకు సూచించడం జరిగిందని తెలిపారు. వరదలు సంభవించిన సమయంలో ఎన్డీఆర్‌ఎఫ్ ఎలా తయారయిందో, డిడిఆర్‌ఎఫ్ కూడా అలాగే ఉన్నదని విపత్తులు వచ్చిన సమయంలో పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటుందని అన్నారు.. ఎన్ డి ఆర్ ఎఫ్ తుంగభద్రా నదిలో ఏర్పాటుచేసిన బోట్ల శిక్షణను తిలకించడానికి విద్యార్థులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై వెంకటస్వామి, తాసిల్దార్ మంజుల, ఎంపీడీవో పద్మావతి, ఎంఈఓ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాక్ డ్రిల్ ను తిలకిస్తున్న అధికారులు


తుంగభద్ర నదిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్ డి ఎఫ్ అధికారులు

# అన్నంలో వడ్ల గింజలా..!

**నిర్వాహకులపై కలెక్టర్ ఆగ్రహం**

**కోడుగల్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాల సందర్శన**

**నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశం**

**మహబూబ్‌గర్ బ్యూరో, జడ్చర్ల, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం జడ్చర్ల మండలంలోని కోడుగల్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అన్నంలో కొద్దిగా వడ్ల గింజ మెరికలు ఉండడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యంను మంచి కడిగి వండి, విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం అందించాలన్నారు. కళాశాలలో ఫుడ్ కమిటీ బోజన నాణ్యత పరిశీలించాలని సూచించారు.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించ కుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వండిన పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్

# బీసీ రిజర్వేషన్లలో బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలు

**కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆవులమంద లక్ష్మయ్య**

**రాజాపూర్ అక్టోబర్ 9 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహిం చాలని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దృఢసంకల్పంతో ముందుకు వెళ్తుంటే భారతీయ జనతాపార్టీ, భారత రాష్ట్ర సమితి పార్టీలు అడ్డుతగులుతూ ఎన్నికలు జరగకుండా చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల నాయకులు, దోండ్లపల్లి మాజీ ఎంపీటీసీ సభ్య లు ఆవులమంద లక్ష్మయ్య అన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అడ్డంకుటు ఎదురైనా బీసీలకు 42శా తం రిజర్వేషన్లు ఇవ్వాలని సుప్రీమ్ కోర్టు, హైకోర్టులో పోరాడేందు కు ముఖ్యమంత్రి ముందువరుసలో ఉన్నారని అన్నారు. బీసీలు, బీసీ సమాజం అధైర్య పడాల్సి న అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాకే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందనిఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆవులమంద లక్ష్మయ్య పేర్కొన్నారు.

## 42బీసీ రిజర్వేషన్లపై

# రేవంత్ రెడ్డి డ్రామా బట్టబయలు

**ప్రభుత్వ చేతగాని తనం వల్ల అయోమయంలో బీసీలు**

**బిజెపి మండల అధ్యక్షులు కాటేపాగ ఆనంద్**

**రాజాపూర్ అక్టోబర్ 9 ప్రభాతవార్త ;** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వ హించుటలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని హైకోర్టు స్టే విధించడం ద్వారా మరోసారి నిరూపితం అయిందని బిజెపి రాజాపూర్ మండల అధ్యక్షులు కాటేపాగ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరాబాదరాగా చెల్లని జీవో తెచ్చి తామేదో బీసీ సామాజికవర్గాన్ని ఉద్ధరిస్తున్నట్టు షో చేసి చట్టం ముందు బోర్లా పడిందని అన్నారు. తెలంగాణ సమాజం ఎలక్షన్లు జరగవని ముందే ఊహించిందని, ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ నకిలీ జీవో ద్వారా ఎలక్షన్ నిర్వహిస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం ఇప్పటికే రెండు సంవత్సరాల కాలం వృధా చేసిందని, తక్షణమే బీసీ సమాజానికి క్షమాపణలు చెప్పాలని అన్నారు. డ్రామాలు ఆపి ఎలా ముందుకు వెళితే ఎలక్షన్లు జరుగుతాయనేది ఆలోచన చేయాలని, రిజర్వేషన్ల పేరుతో బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజా కోర్టులో శిక్ష తప్పదని స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కాక తప్పదని ఈ సందర్భంగా కాటేపాగ ఆనంద్ హెచ్చరించారు.

# ఈవీఎం గోదాము తనిఖీ

**- భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలిన**

**- నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత ముఖ్యమని, గోదాములో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థలను నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షించారు. కలెక్టర్ సాంకేతిక సిబ్బందితో మాట్లాడి, యంత్రాల నిర్వహణ విధానం, రికార్డు నిర్వహణ, రోజువారీ పర్యవేక్షణ చర్యలపై వివరాలు తెలుసు కు న్నారు. ప్రతి నెలా ఈవీఎంలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, భద్రతా పరికరాలు ఎల్లప్పు డూ సక్రమంగా పనిచేస్తున్నాయా అని నిర్ధారించుకోవడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. గోదాములో ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉండాలని సూచిస్తూ, గోదా ములో పనిచేస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అవస రమైతే సీసీ కెమెరా రికార్డులను సమీక్షిస్తూ ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరిం చాలని సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రతపై ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, గోదాములో అగ్ని ప్రమాద నిరోధక పరికరాలు, విద్యుత్ సదుపాయాలు, రక్షణ గార్డుల విధులు వంటి అంశాలను కూడా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు భద్రతా చర్యలు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎండి హుస్సేన్, శివకృష్ణ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఈవీఎం గోదామ్‌లను పరిశీలిస్తున్న దృశ్యం

# ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండాలి

**మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ దిశా నిర్దేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగిన అందరూ సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పార్టీ నాయకులకు సూచించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన హన్వాడ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువ ఉందని, ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు విజయ అవకాశలు ఎక్కువ ఉన్నాయని తెలిపారు. ప్రజలకి బాకీ కార్డును ఇచ్చి ప్రభుత్వం చేసిన మోసం వివరించాలని చెప్పారు. పదేండ్ల కాలంలో గ్రామం, మండలంలో చేసిన అభివృద్ధి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకి వివరించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ జడ్పీటీసీ నరేందర్, పార్టీ మండలం అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, సీనియర్ నాయకులు చెన్నయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## జర్నలిస్టు శంకర్ గౌడ్‌కి ఆర్థికసాయం

**మహబూబ్‌నగర్, అక్టోబరు9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బిగ్ టీవీ స్టాఫర్ శంకర్ గౌడ్ సతీమణి అనారోగ్యంతో హైదరాబాద్లోని దవాఖానాలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న తోటి జర్నలిస్టులు శంకర్ గౌడ్‌కు అండగా నిలిచారు. మేమున్నామంటూ భరోసానిస్తూ అంతా కలిసి తమవంతుగా ఆర్థిక సాయంగా 54 వేల రూపాయలను అందజేశారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్‌క్లబ్‌లో ఆర్థిక సాయం అందజేశారు. విషయం తెలుసు కున్న జర్నలిస్టులు అందరూ తమవంతుగా ఆర్థిక సాయం అందిస్తూ మనోధైర్యం చెబుతున్నారు. శంకర్ గౌడ్ సతీమణి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## జిల్లాలో ఏకైక నామినేషన్ దాఖలు చేసిన చంద్రశేఖర్ రెడ్డి

**మల్దకల్ అక్టోబర్9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాటికుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి ఎంపీటీసీగా గురువారం తన నామినేషన్ దాఖలు చేశారు. తాటికుంట మండల ప్రాదేశిక నియోజకవర్గం నుండి నామినేషన్ వేసారు. జిల్లాలో మొదటి విడతలో69మందిలో ఒక్కరే వేసారు. హై కోర్ట్ స్టే విధించడంతో ఎన్నికలు జరగక పోవచ్చని ఆశావహులు నిరాశకు గురయ్యారు.

# హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండకట్టాలి

**రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో**

**బిఆర్ఎస్ లోకి భారీ చేరికలు**

**గద్వాల టౌన్ అక్టోబర్ 9, ప్రభాతవార్త:** ఆరు గ్యారంటీలను నిరవే ర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండకట్టాలనీ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిఆర్ యస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు బిఆర్ యస్ నాయకు లకు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. గద్వాల మండలంలోని కాకులారం గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం బిఆర్ యస్ పార్టీ లోకి చేరగా వారికి బాసు హనుమం తు నాయుడు పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికలలో తిమ్మప్ప, వెంకటేశ్వర రావు, కె.రామాంజనేయులు, వెంకటేశ్వర రావు, కె.వెంకటేష్, రాజు, వెంకటన్న, తిమ్మప్ప, తిరుమలేష్, కృష్ణ, శ్రీను, బీచుపల్లి, కురవ కృష్ణ, కె. రవి ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. అదేవిధంగా గద్వాల నియోజకవర్గం మార్లబీడు, రేపల్లె, మన్నాపురం, కె.టీ.దొడ్డి గ్రామ నాయకులు కాంగ్రెస్ ను వీడి బిఆర్ యస్ పార్టీ లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు లో మార్లబీడు కు చెందిన గోలు నరసింహులు, చిన్న ఈరన్న, పి.నరసింహులు, సుధాకర్, సత్యారెడ్డి, కూరగాయల తిమ్మారెడ్డి, కురవ ధర్మన్న, కె.వెంకటేష్, ప్రతాప్, ప్రకాష్, చిన్న సవరన్న, చెట్టుకింద ఆనంద్, దుబన్న, నవీన్, రాజు, కల్యాణ్, ఏసురత్నం, భాస్కర్, యేసు ఇమాన్యుల్, చెట్టుకింద తిమ్మప్ప, రాజు, తిమ్మన్న, అమరేశ్, బజారన్న బుగన్న తదితరులు ఉన్నారు రేపల్లె గ్రామం నుండి రాధాకృష్ణ, ఈశ్వరన్న, జమన్న, కృష్ణ, తదితరులు , మన్నాపురం గగ్రామం నుండి ఆంజనేయులు, దుబన్న, ఆంజనేయులు, కృష్ణ, కె.టీ.దొడ్డి నుండి తోట మారెప్ప, తిమ్మప్ప, కురుమయ్య ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. చేరికలు అనంతరం ఆయన మాట్లాడుతూ.... గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఆశపడి ప్రజలు మోసపోయారన్నారు. ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారంటీలపై ప్రశ్నించేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కృషిచేసి బిఆర్ యస్ పార్టీ బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీని గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరగొద్దని కాంగ్రెస్ చూస్తున్నదని, జరగాలని బీఆర్ఎస్ కోరుకుంటున్నదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం బీఆర్ఎస్ కు అనుకూలంగా ఉందని, శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జీ.రాఘవేంద్ర రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, చక్రధర్, బీచుపల్లి, రాజారెడ్డి, మోనేష్, శ్రీరాములు, తిమ్మప్ప, కృష్ణ, మోహన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.





గులాబీ కండువ కప్పి పార్టీ లోకి ఆహ్వానిస్తున్న బాసు హనుమంతు నాయుడు.

## ఆల బాలవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే ,మాజీ ఎమ్మెల్యే

**భూత్పూర్, అక్టోబర్ 9, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామ మాజీ సర్పంచి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిన తండ్రి, భూత్పూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్, మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ సూదిని జైపాల్‌రెడ్డి అనుంగు శిష్యులలో ఒకరైన ఆల బాలవర్ధన్ రెడ్డి(76) అనారోగ్య కారణాల వల్ల గురువారం తెల్లవారు జామున మృతిచెందారు. అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం బాల్‌వర్ధన్ రెడ్డి స్వగ్రామం అన్నాసాగర్‌లోని ఆయన వ్యవసాయ పొలంలో జరిగాయి. అంత్యక్రియలకు దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి (జీఎంఆర్) హాజరై ఆల బాలవర్ధన్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛముంచి ఘనంగా నివాళులర్పించారు. పినతండ్రిని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మృతుడి కుమారుడు బీఆర్ఎస్ నేత ఆల శ్రీకాంత్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జీఎంఆర్ పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియానాయక్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డిలతో పాటు నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డి, తమన్నగౌడ్‌లు పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నుంచి మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఇతర నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళీధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మనెమోని సత్యనారాయణ, మేకల సత్యనారాయణ, ఆకుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



బాలవర్ధన్‌రెడ్డి పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్



ఆల బాలవర్ధన్‌రెడ్డి భౌతిక కాయం వద్ద మాజీ ఎమ్మెల్యే ఆలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే



భవిత సెంటరును తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# భవిత సెంటర్ తనిఖీ

**జడ్చర్ల, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం జడ్చర్లలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని కలెక్టర్ విజయేంద్ర బోయి తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ విధానం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న టాయిలెట్ పరిశీలించి వెళ్లేందుకు భవనం నుండి దారి ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట మండల విద్యాధికారి మంజుల తదితరులు ఉన్నారు.

## పిడి సుకన్యకు

# జాతీయ పురస్కారం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ ఒరగంటి ఆనంద్, వైఎస్ విమలమ్మ హాజరయ్యారు. పిడి సుకన్య వనపర్తి పట్టణంలోని ఎంబి ఒలివ చర్చికి చైర్మన్ గా వనపర్తి మున్సిపాలిటీలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ విరామం లేకుండా చర్చి మినిస్ట్రీ సామాజిక ఆధ్యాత్మిక సేవలను గుర్తించి ఈ అవార్డు బహుకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ది నేషనల్ బెస్ట్ అవార్డు గ్రహీత సుకన్యను పట్టణ ప్రముఖులు పట్టణంలోని ఆయా చర్చిలకు సంబంధించిన పెద్దలు ఎంబి ఒలీవ చర్చ్ సభ్యులు అభినందించారు.

## ఎంపీడీఓ కార్యాలయాన్ని

# సందర్శించిన కలెక్టర్

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించా రు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చేపట్టిన చర్యల గురించి కలెక్టర్ అడిగి తెల్సుకున్నారు. భూత్పూర్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ వేణుగోపాల్, ఇంచార్జీ ఎంపీడీఓ శ్రీదేవితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**కొసమెరుపు..** గురువారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించడంతో పాటు తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరిస్తున్న తరుణంలో హైకోర్టు ఈ ఎన్నికలను రెండు వారాలకు స్టే విధించడంతో, ఎన్నికల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడి ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోవడం కొసమెరుపుగా నిలిచింది.

# నేడు పేటలో ఎమ్మెల్యే పర్యటన

**నారాయణపేట టౌన్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట నియోజకవర్గంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి పాల్గొననున్నారు. కార్యక్రమాలు వివరాలు ఉదయం 8:30 గంటలకు దామరగిద్ద మండలం మొగల్ మడ్క గ్రామంలో ఎస్బీఐ బ్యాంకు నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అదే గ్రామంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 11:00 గంటలకు నారాయణ పేట పట్టణంలోని సీవీఆర్ భవన్‌లో ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# వృద్ధ దంపతులు గల్లంతు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి కురిసిన భారీ వర్షాలతో కిష్టారం పోతిరెడ్డి చెరువు అలుగు పారుతుండడంతో ఉదయమే ఆ రహదారిపై నుండి రాకపోకలను గ్రామస్తులు మూసివేశారు. అయినప్పటికీ వృద్ధ దంపతులు అలుగు నీటిలో నుంచి దాటేందుకు సాహసం చేయగా నీటి ఉధృతిలో గల్లంతయి తన ప్రాణాలని కోల్పోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గల్లంతైన వృద్ధ దంపతుల ఆచూకీ కొరకు గాలింపు చర్యలు చేపడుతున్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో పిడుగుపాటుకు మహిళ మృతి చెందడంతో విషాద ఘటన చోటుచేసుకుంది. పరిమళాపురం ప్రాంతానికి చెందిన కందుకూరు పద్మ అనే మహిళ తన పొలంలో పత్తి తీస్తుండగా గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడి పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పిడుగుపాటుకు మహిళ మృతి

**నారాయణ పేట, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ పరిధిలో వ్యవసాయ పనులు చేస్తుండగా గురువారం ఉరుములతో కూడిన వర్షం కురవడంతో పిడుగుపాటుకు గురై పట్టణానికి చెందిన పద్మ (35) మృతి చెందింది. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. తరువాత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబానికి ప్రభుత్వం నుండి సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షులు ఎం.డి.సలీం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గందే చంద్రకాంత్, మనోహర్ గౌడ్, మల్లేష్, కోట్ల మధుసూదన్ రెడ్డి, వెంకు గౌడ్, మారుతీ, రాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ముగ్గురు అస్వస్థత

## ఒకరి పరిస్థితి విషమం

**జడ్చర్ల (నవాబుపేట) :** గురువారం సాయంత్రం కురిసిన వర్షాలకు ఉరుములతో మెరుపులతో కూడిన పిడుగు పాటుకు మండల పరిధిలోని కూచూరు గ్రామానికి చెందిన జుట్టు చిన్న కృష్ణయ్య, జుట్టు పెద్ద కిష్టయ్య భార్య సునిత, పిడుగుపాటుకు ముగ్గురు స్పృహ కోల్పోయి పొలంలో పడిపోయారు. పొలంలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో పెద్ద కృష్ణయ్య భార్య సునీత పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. అటుగా వెళుతున్న రైతులు చూసి గ్రామస్తులకు తెలియజేయడంతో, కుటుంబ సభ్యులు హుటాహుటిన జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు.





పిడుగుపాటుకు మృతి చెందిన మహిళ మృతదేహాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి

## దంచి కొట్టిన వాన..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుంది. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు జ్వరం నాయక్ ప్రజలకు సూచించారు. కాగా మండల పరిధిలోని గ్రామాలలో పంట పొలాలన్నీ చెరువులు కుంటలుగా మారాయి. దీంతో పంటలు సాగు చేసిన రైతుల్లో ఆందోళన మొదలైంది. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగులతో కూడిన వర్షం కురియడంతో కొంత మంది రైతులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఏదేమైనా దీంతో పలుచోట్ల రోడ్లన్నీ బురదమ యమయ్యాయి. ఈ ఏడాది 30 సంవత్సరాల పాటు కనివిని ఎరుగని వర్షాలు పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. కూచూరు పెద్ద చెరువు అలుగు ఉధృతంగా పారుతుండటంతో తాల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుందని చుట్టుపక్కల ఉన్న రైతులు ఎన్నడూ చూడలేని విధంగా ఈ మారు వర్షాలు పడ్డాయని రైతులు వాపోతున్నారు.





# పూడ్చిన శవానికి పంచనామా

**భూత్పూర్, అక్టోబర్ 9, ప్రభాతవార్త :** పూడ్చిన శవానికి 72రోజుల అనంతరం శవ పంచనామా నిర్వహించిన సంఘటన భూత్పూర్ మండలం కప్పెటలో గురువారం చోటుచేసుకుంది. భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెల్పిన వివరాల ప్రకారం కప్పెట గ్రామానికి చెందిన బేడ బుడగ జంగం సంతోష (30) కూలీ పనిచేస్తూ కాలాన్ని వెల్లదీసేవాడు. ఈ ఏడాది జూలై 29న గ్రామానికి చెందిన రాజారెడ్డికి సంబంధించిన ట్రాక్టర్‌పై మట్టి పని ఉందని చెప్పి సంతో ష్‌ను గ్రామానికి చెందిన వడ్డె యాదయ్య తోడ్కొని పోయాడు. ఇదే రోజు మధ్యాహ్నం సంతోష్ అక్కడే స్పృహతప్పి పడిపోవడంతో సదరు రాజారెడ్డి ఫోన్ ద్వారా మృతుని సోదరుడు శ్రీనివాస్‌కు తెలుపగా, శ్రీనివాస్ ఈ విషయాన్ని తన మరో సోదరుడు అంజనే యులుకు తెలుపగా అంజనేయులు కొన ఊపిరితో ఉన్న సంతోష్‌ను ఇంటికి తీసుకువచ్చాడు. ఇదే రోజు సాయం త్రం ఆరు గంటలకు సంతోష్ మృతి చెందాడు. మరుసటి రోజు అన్ని లాంఛనాలతో సంతోష్ మృతదేహాన్ని పూడ్చారు. అయితే శవాన్ని అంతిమ సంస్కారానికి ముందు స్నానాదికార్యాలు చేస్తున్న క్రమంలో మృతదేహంపై గాయాలు, గాట్లు ఉండడం మృతుని కుటుంబీకులు, బంధువులు గమనించారు. మృతదేహాన్ని మరుసటి రోజు ఈ ఏడా ది జూలై 30న పూడ్చిపెట్టారు. మృతిపట్ల అనుమానం కల్గిన మృ తుని కుటుంబీకులు, బంధువులు రెండు నెలల అనంతరం గత నెల 27న భూత్పూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమో దైంది. అనుమానా లను నివృతి చేసేందుకు గురువారం భూత్పూర్ తహసిల్దార్ కిషన్‌నాయక్ సమక్షంలో భూత్పూర్ ఎస్సై ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ప్రధానోసుపత్రి వైద్యులు డాక్టర్ సుధాకర్ ఇతర వైద్య బృందం సభ్యులు పూడ్చిన శవాన్ని 72రోజుల అనంతరం వెలికి తీసి శవ పంచనామా (పోస్ట్‌మార్టమ్) నిర్వహించినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. పోస్ట్‌మార్టమ్ రిపోర్టు అందాల్సి ఉందని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

**మృతుడి కుటుంబానికి యాభైవేల రూపాయలు**

తీవ్రంగా గాయపడి ఆపస్మారక స్థితికి చేరుకున్న సంతోష్‌కుమార్ కుటుంభీకులకు వారి కుటుంబ సభ్యుల డిమాండ్ మేరకు ట్రాక్టర్, మిషన్‌ల యజమాని రాజారెడ్డి మరికొంత మంది కలిసి రు.యాభై వేల ఒప్పంధం కుదుర్చుకుని తొలుత రు.30వేలు ఆ తదుపరి రు.20వేలు మొత్తం రు.యాభై వేలు మృతుని కటుంభీకులకు చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. ట్రాక్టర్, మిషన్‌లతో గాయపడి చనిపోయాడని మృతుని కుటుంభీకులు పేర్కొంటుండగా, సదరు మృతుడు సంతోష్ కూలి పనిచేస్తూ వచ్చిన డబ్బులతో ఫుట్‌గా తాగేవాడని, తాగిన మైకంలో మట్టి పనిలో కింద పడిపోయి ఉండవచ్చని ట్రాక్టర్ యజమాని రాజారెడ్డితో పాటు గ్రామానికి చెందిన పలువురు ఆరోపించడం, డబ్బులు చెల్లించడం పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటి అనుమానాలు నివృతి అయ్యేందుకు భూత్పూర్ పీఎస్‌లో నమోదైన కేసును పరిష్కరించేందుకు గురువారం భూత్పూర్ తహసిల్దార్ కిషన్‌నాయక్ సమక్షంలో పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సుధాకర్ ఇతర వైద్య బృందం సభ్యులు కప్పెటలో పూడ్చిన 72రోజుల అనంతరం సంతోష్ శవాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించారు.